తరుణ - 1974

కిరసనాయిలు దీపం, కొవ్వొత్తి, ఎలక్ట్రిక్ బల్బు అన్నీ చీకటిని పారద్రోలే సాధనాలే. కానీ పక్క పక్కన ఉన్నప్పుడు వీటిని పోల్చడమూ, ఎక్కువ తక్కువలు తేల్చడమూ అనుకోకుండా జరుగుతుంది.

# ఘుర్‌ఘుర్‌కీ కహానీ

"చాలామంది ఎదుటివాళ్ళకోసం జీవిస్తారు వసూ! నాకది ఇష్టముండదు" అన్నాడు భార్య వసంతతో మూర్తి.

అతని మాటలు వసంతకు సరిగ్గా అర్థమయినట్లులేదు. అదోలా ముఖం పెట్టిందామె.

ఆమె ముఖం చూసి ఆ విషయం గ్రహించిన మూర్తి నవ్వుతూ "ఎదుటి వాళ్ళ కోసం జీవించడమంటే నీకర్థం తెలియదనుకుంటాను. ఉదాహరణకు నువ్వు శ్రావణ శుక్రవారం నాడు కొత్త చీర కొన్నావు. ప్రస్తుతం మన ఎకానమీ అంత బాగాలేదు. ఆ సంగతి నీకూ తెలుసు. అదీ కాక చీరలు నీకు అంత అవసరం కూడా కాదు, కొత్తవి అనదగ్గ చీరలు నీకిప్పుడు ఏడెనిమిదైనా ఉన్నాయి కూడా. అయినా నువ్వు కొత్త చీర కొనుక్కున్నావు శ్రావణ శుక్రవారానికని. అందుక్కారణం బట్టలమీద నీకున్న అత్యాశకాదు. నీకు తెలిసిన ఆడవాళ్ళందరూ "అయ్యో, శ్రావణ శుక్రవారం పూటా చీరకొనుక్కోలేదా" అని అంటారని. అది జాలికావచ్చు, దెప్పి పొడుపు కావచ్చు - కానీ దాన్ని నువ్వు భరించలేవు. అది తప్పించుకోవడం కోసం అప్పయినా చేసి చీర కొనుక్కుంటావు. దీన్నే ఎదుటివాళ్లకోసం జీవించడమంటారు" అంటూ ముగించాడు మూర్తి.

వసంత ముఖంలో ఉడుకుమోత్తనం ఛాయలు కనిపించాయి. "ఆహాహా - ఒక్క చీర కొని ఎంత ఉపన్యాసమిచ్చారండీ! ఏదో నాలుగునెల్ల తర్వాత ఓ కొత్త చీర కొనుక్కుంటే మీకంత ఇదిగా ఉంది. శ్రావణ శుక్రవారం పూటా, ఎంతలేనివారైనా కొనుక్కుంటారు" అందామె.

"మన అవసరాన్ని బట్టీ, స్తోమతును బట్టీ బట్టలు కొనుక్కుంటాం గానీ - ఇబ్బంది పడుతూ, అప్పులుచేస్తూ - ఆనందంగా పండుగలు జరుపుకోలేం గదా"

అన్నాడు మూర్తి.

"ఏమో బాబూ- మీకో సరదాలేదూ, పాడూలేదు. అందరితోబాటు చేసుకునే పండుగలో ఉన్న సరదా - మన దగ్గర డబ్బున్నప్పుడు ఒక్కళ్ళమూ ఒంటిపిల్లి రాకాసిలా చేసుకోవడంలో ఏం ఉంటుంది." అంటూ విసురుగా అక్కణ్ణించి లేచి వెళ్ళిపోతూ "పక్కింటావిడ ఈరోజు కూడా ఓ చీర కొనుక్కుంది. ఈ నెల్లో ఆవిడ కొన్న మూడో చీర అది" అనేసి భర్త ముఖం కేసైనా చూడకుండా వెళ్ళిపోయింది వసంత.

భార్యకు కోపం వచ్చిందని గ్రహించాడు మూర్తి. అతను ఆమె వెనకే వంటింట్లోకి వెళ్ళి "నామీద కోపమొచ్చిందా వసూ! నిన్ను నొప్పించాలన్నది నా అభిమతం కాదు. నువ్వు కొత్తచీర కట్టుకుంటే నాకంటే సంతోషించేవాళ్ళెవరు చెప్పు? ఏదో నా ఇబ్బంది కొద్దీ అలాగన్నాను కానీ" అన్నాడు.

వసంత మాట్లాడలేదు, మౌనంగా వంట ప్రయత్నం మొదలెట్టింది. మూర్తి ఇంకా ఏవో మాట్లాడబోయాడు కానీ నిద్రపోతున్న వారి ఏకైక పుత్రికా రత్నం సరిగ్గా అప్పుడే మేల్కొని రాగం మొదలెట్టడంతో వసంత తరుగుతున్న కూరనల్లాగే వదిలేసి, లేచి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోగానే మూర్తి ఆలోచనలో పడ్డాడు.

వసంత మూర్ఖురాలు కాదు. పియ్యూసి చదివింది. దారుణమైన ఖర్చు మనిషీ కాదు. డబ్బునెలా ఆదా చెయ్యాలో ఆమెకు తెలుసు. అంతేకాక భర్తకు తెలియకుండా డబ్బు దాచే అలవాటు కూడా ఆమెకు లేదు. తను ఆదా చేసిన ప్రతి పైసా వివరమూ ఆమె భర్తకు చెబుతుంది. అయితే ఆమెలో ఉన్నది ఒక్కటే లోపం అది లోపమని అంతా అనలేరు. మూర్తి దృష్టిలో మాత్రం అది లోపమే. ఎదుటివారి ప్రభావానికి ఆమె అతిసులభంగా లోనవుతుంది. ఒక్కొక్కప్పుడు ఆమె జీవించేది కేవలం ఎదుటివారి కోసమేనా అన్న అభిప్రాయం అతనికి కలిగేటంత సులభంగా ఆమె ఎదుటివారి ప్రభావానికి లోనవుతుంది.

మూర్తి జీతం మరీ అంత తక్కువేం కాదు. అతనికి అన్ని కటింగులూ పోను నెలకు చేతికి నాల్గొందల యాభై పై చిలుకు వస్తుంది. ఇంటి ఖర్చులకు మూడొందల పై చిలుకుపోగా అతనికి కనీసం వంద రూపాయలు పైగా మిగుల్తుంది. ఆ డబ్బు తోనే అతను చీరలు కొన్నా, ఫర్నిచర్ కొన్నా ఏం చేసినా ఇదికాక ఏడాదికో రెండు వేల రూపాయలు భూముల మీది ఆదాయం వస్తుంది. ఈ రెండూ కలుపుకుంటే అతని ఆర్థిక పరిస్థితి మంచిదేనని తేల్తుంది.

అయితే జీవితమన్నాక ఒడుదుడుకులు లేకుండా ఉండడం కష్టం కదా- అనుకోని ఖర్చులు తగలవచ్చు. అదీకాక నెలనెలా అతనుకొంచెం డబ్బు పోస్టల్ సేవింగ్స్‌లో దాస్తున్నాడు. మరికొంత ఇన్సూరెన్స్ ప్రీమియమ్ కడుతున్నాడు. ఇలా అన్నీ పోను చూసుకుంటే అతని చేతిలో పెద్దగా మిగిలేదేమీ ఉండదు.

కాపురం పెట్టినప్పటి నుంచి వసంత పూర్తి సహకారం లభించడం వల్లనే సంసారానికి అవసరమైన చాలా వస్తువులు అతను కొనగలిగాడు. వాళ్లింట్లో గ్యాస్

స్టవ్వూ, ప్రెషర్ కుక్కరూ, డైనింగ్ టేబులూ, సోఫాసెట్టూ వగైరాలున్నాయి. మూర్తికిప్పుడు తన సంసారాన్ని గురించి సంపూర్ణమైన సంతృప్తి ఉంది. వసంతక్కూడా అంతే అయిదారు నెలల క్రితం వరకూ.

మూర్తి కాపురం పెట్టి ఆరేళ్ళయింది. అతని తొలి సంతానం ఆడపిల్ల - పది నెలల క్రితం పుట్టింది. ఏడు నెలల క్రితం వసంత పుట్టింటినుంచి వచ్చింది. పిల్ల పుట్టినప్పటినుంచీ వసంతలో మార్పు కనబడసాగింది. ఇదివరకటి పొదుపరితనం ఆమెలో తగ్గింది. బజార్లో కంటికి నదురుగా కనిపించిన ప్రతీ వస్తువునూ పాపకు కొందామంటుంది. చంటిదానికి బొత్తిగా అరడజను మాత్రమే గౌనులున్నాయంటుంది. నెలనెలా ఎదిగే కూతురికి డజన్లకొద్దీ బట్టలు కొనడానికి మూర్తి కయిష్టంగా ఉండేది. మొట్టమొదటి పిల్లకామాత్రం ముచ్చట జరగకపోతే ఎలా గంటుంది వసంత. ఆమెను సమాధాన పరచడం చాలా కష్టమైపోయేది మూర్తికి. ఎంత కష్టమైనా ఆమెను సమాధానపర్చడానికే ప్రయత్నించేవాడు మూర్తి. కానీ ఆమె అడిగిన ప్రతిదీ మాత్రం కొనేవాడు కాదు.

"చూడు వసూ - అది చిన్నపిల్ల. నువ్వు కొత్త గౌను కొంటే సంబరపడ్డం దానికి తెలియదు. బట్టలుకొనకపోతే దానికి బాదలేదు. అదీకాక నెలనెలా ఎదిగే పిల్ల. ఈ నెలకు కొన్నవి పై నెలకు పనికిరావు. అంచేత నెలకొకటో రెండో కొంటే సరిపోతుంది. దానిగురించి డబ్బు వృథా చెయ్యడం మాని ఏసేవింగ్స్ ఎకౌంట్‌లోనో అయిదేళ్ళపాటు నిలవేస్తే అది నిజంగా ఆనందించే సమయానికి ఆ డబ్బుతో దానికి బోలెడు కొనవచ్చు" అనేవాడతను. ఈ మాటలు కాదనలేకపోయేది వసంత. కొందామనుకున్నది కొనడం వీలుపడలేదని అసంతృప్తిగా ఉన్నా అప్పటిమటుక్కు మాట్లాడకుండా ఊరుకునేది. అదే మూర్తికి కావలసింది.

ఈ విధంగా భార్యతో నెగ్గుకు వస్తున్న మూర్తికి సరిగ్గా అయిదునెలల క్రితం పెద్ద కష్టం వచ్చి పడింది పక్కింటి పంకజాక్షి రూపంలో.

సరిగ్గా అయిదు నెలల క్రితమే పంకజాక్షి గారు మూర్తికి పక్కవాటాలోదిగింది. అన్నాళ్ళూ ఆ వాటాలో ఇంటి వాళ్ళే ఉండేవాళ్లు. ఇంటాయనకు ఢిల్లీలో పెద్ద ఉద్యోగం దొరకడంతో ఆ ఊళ్ళోని చిన్న ఉద్యోగాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. పక్క వాటాను మూర్తికే అప్పజెప్పి ఎవరికైనా అద్దెకిచ్చేయమన్నాడు. అది చాలా పెద్ద వాటా, అద్దె నూట యాభై రూపాయలు. ఇంటాయన మూర్తికి పెత్తనమిచ్చిన మూడు వారాల్లోనే పంకజాక్షి గారు ఆ ఇంట్లో పాదం మోపింది.

పంకజాక్షి పొరుగూళ్ళోని ఓ లక్షాధికారి కూతురు. ఆమె భర్త ఈ ఊళ్ళో ఒక కంపెనీలో మేనేజరుగా ఉంటున్నాడు. స్వంతిల్లు కట్టుకోగల స్తోమతున్నా అతని ఉద్యోగం ప్రతీ రెండేళ్ళకూ ఊరు మారేది కాబట్టి అద్దె ఇంటి ఆగత్యం తప్పలేదు వారికి.

కిరసనాయిలు దీపం పక్క కొవ్వొత్తి కాంతివంతంగా కనిపిస్తుంది. ఎలక్ట్రిక్ దీపం ముందు కొవ్వొత్తి వెలవలబోతుంది. అన్నీ దీపాలే. అన్నిటి ఉద్దేశ్యమూ చీకటిని

పారద్రోలడమే. అన్నీ మానవుడికి ఉపయోగకరమైనవే. అయితేపక్క పక్క ఉన్నప్పుడు వీటిని పోల్చడమనేది అనుకోకుండా జరుగుతుంది. ఎక్కువ తక్కువలు తేల్చడం కూడా జరుగుతుంది. ఇప్పుడు వసంత విషయంలోనూ అంతే జరిగింది.

పంకజాక్షి మరీ వసంత అంత అందమైనది కాకపోయినా ఆకర్షణీయంగా ఉంటుంది. వసంతకు సమవయస్కురాలేకానీ అలంకరణలో ఇద్దరకూ చాలా భేదముంది. పంకజాక్షి అత్యంత ఆధునికంగా అలంకరించుకుంటుంది. ఆమెకు బోలెడు చీరలు, నగలూ ఉన్నాయి. ఇంట్లో బోలెడు హంగులున్నాయి. టేప్ రికార్డర్, రేడియోగ్రాం, ఫ్రిజిడైర్, ఎలక్ట్రిక్ గ్రైండర్, ఇవి కాక బోలెడు మంది పనివాళ్ళు, వంట మనిషీ, తోట మాలి, పనిమనిషి, వీళ్ళు కాక నిత్యమూ వీళ్ళింట్లోనే ఉండిపోయే అవసరాన్ని బట్టి అన్ని రకాల పనులు చేసే మరో పనికుర్రవాడూ ఉన్నారు.

పంకజాక్షి తమ ఇంటి పక్కకు వచ్చిన వారం రోజుల్లోనే వసంత కొన్ని ముఖ్యమైన విషయాలు గ్రహించింది. పంకజాక్షి కాస్మెటిక్స్‌కి చేసే ఖర్చు - తమ పాలఖర్చుకు రెండింతలు. పంకజాక్షి ఇక పనికిరావు, చాలాసార్లు కట్టేశాను, పాతవైపోయాయి అనుకునేలాంటి చీరలు తనింకా కొత్తవి అనుకునేలా ఉంటాయి. పంకజాక్షి వారానికి ఒకసారి చాకలికివేసే బట్టలు తమ వీధివాళ్ళందరూ కలిసి నెల్లాళ్ళు వేసేటన్ని ఉంటాయి.

పంకజాక్షికి వారం రోజుల్లో అయ్యే ఖర్చు తన మగడి జీతం ఒకటే.

ఇవన్నీ కలిసి వసంతకు పంకజాక్షి పై అసూయ కలిగించలేదు - అందుకు బదులు వసంతకు ఆమెపై విపరీతమైన గౌరవభావం కలిగింది.అందుకు కారణం పంకజాక్షి ప్రవర్తన అనే చెప్పాలి.

పంకజాక్షి ఎన్నడూ దర్పాన్ని ప్రదర్శించలేదు. అనగా ఆమెకు గర్వం లేదని కాదు. వసంతతో మాత్రం చాలా అప్యాయంగా మాట్లాడేది. వసంతను ప్రతి విషయంలోనూ తనతో సమానం చేసేది. ఇది వసంతకు చాలా ఆనందాన్ని కలిగించేది. తన దర్పాన్ని వసంతముందు ప్రదర్శించేముందు వసంత ఇంట్లోని వస్తువుల్ని మెచ్చుకునేదామె. అందువల్ల కలిగిన ఆనందంలో పంకజాక్షి ప్రదర్శించిన ఎంతటి దర్పాన్నయినా భరించగలిగేది వసంత.

"మీ డైనింగ్ టేబుల్ చాలాబాగుంది చాలా ఆకర్షణీయంగా ఉంది. కొనుక్కుంటే ఇలాంటి అందమైనవే కొనుక్కోవాలి. వేం కొనేటప్పుడు కూడా ఇలాంటి దే తీసుకుందామనుకున్నాము. అయితే మావారున్నారు చూడండి - ఆయనకు ఖరీదు పట్టింపెక్కువ - వెయ్యి రూపాయల లోపులో అయితే టేబుల్ కొననన్నారు. చచ్చినట్లు ఇదేకొన్నాం - వస్తువుకి అందం ముఖ్యం కానీ ఖరీదు ముఖ్యంటండీ" అనేదావిడ తన డైనింగ్ టేబిల్ చూపించి.

వసంత వెంటనే "అలా గనకండి. మీ టేబుల్ చాలా బాగుంది. ఖరీదుకీ క్వాలిటీకి బోలెడు సంబంధముంది" అనేది మనసులో సంబరపడుతూ.

"ఈ చీర ఎంతక్కొన్నారండీ చాలా బాగుంది" అని ఖరీదు తెలుసుకుని నిట్టూర్చేది

జీవించాలని ఉంటుంది. అందులోనే బోలెడు హాయుంటుంది. కానీ మావారి వల్ల ఖర్చు అలవాటయింది. అలవాటయ్యేక తగ్గించుకోవడం కష్టం కదా? పోన్లెద్దూ మనకేం లేదా, పోదా అని సరిపెట్టుకున్నాను" అని నిట్టూరుస్తూ, దర్పాన్ని ప్రదర్శించేంది.

ఇలా మనకేం లేదా,పోదా అంటూ ఆవిడ వసంతకి చాలా ఖర్చులు తగిలించింది. చవకగా వచ్చినా బయట బడ్డీ కొట్లలో బట్టలు కొనకూడదండీ. ఖరీదెక్కువైనా షాపుల్లో వాటి అందమే వేరు. అయినా మీకున్నది ఒక్కత్తే పిల్ల. మనకేం లేదా పోదా. రేడియో సెట్టు మరీ అంత చిన్నదిగా ఉందేమిటండీ. ఓ రేడియో గ్రాం కొనిపెడితే ఈ టేబుల్ నిండుగా ఉంటుంది. మీ వారికి రేడియోగ్రాం కొనడం ఇష్టం లేకపోతే ఇంకో చిన్న టేబుల్ చేయించి రేడియో దానిమీదకు మార్చేయండి. అమరికగా ఉంటుంది. అయ్యో పనిమనిషి లేకుండా ఎలాగండీ? ఎల్లకాలం ఇలాగే ఉంటామా? ఎప్పుడైనా ఓ రోగం, వస్తే మనని చూసేవాళ్ళెవరు చెప్పండి – పనున్నా లేకపోయినా పనిమనిషిఉంటే ఆ సులువు వేరు. మన పని మనం చేసుకోవడంలో తప్పులేదు కానీ మనకంత అవసరమేముందండీ, మనకేమన్నా లేదా పోదా–

ఇలా చాల విషయాల్లో పంకజాక్షి గారు సలహా నివ్వడమూ, వసంత మంత్ర ముగ్ధురాలిలా వాటిని వినడమూ మూర్తికి తలనొప్పి రావడమూ ఇంతింతై వటుడింతై అన్నట్లు రోజు రోజుకు ఎక్కువ కాసాగాయి. కొన్ని ఖర్చులు అతనికి తప్పడం లేదు. మరి కొన్ని ఖర్చులువిషయంలో ఇద్దరూ గొడవ పడవలసి వస్తోంది. మరి కొన్నిటి విషయంలో అసంతృప్తిగానే సమాధానపడేది వసంత. మొత్తం మీద మూర్తికి సంసార జీవితం అంత సాఫీగా గడపడం లేదు.

అన్నిటికంటే పెద్ద సమస్య అతనికి మరో పది రోజుల అనంతరం వచ్చింది. అది పంకజాక్షి రెండో కొడుకు పుట్టినరోజు రూపంలో.

ఆ పుట్టిన రోజు పండగ చాలా అద్భుతంగా జరిగింది. గొప్ప గొప్ప అతిథులంతా వచ్చారు. అతిథుల్లో వసంతా, మూర్తీ కూడా వున్నారు. విందు చాలా ఖరీదైనది. కుర్రవాడికి కూడా ఖరీదైన బహుమతులు వచ్చాయి. వసంతా, మూర్తీ కూడా ఖరీదైన బహుమతి సమర్పించుకున్నారు. ఆ రోజు బాగానే గడిచింది. ఆ తర్వాత రోజు నుంచి మూర్తి సమస్య ప్రారంభమయింది.

మూర్తికి పుట్టినరోజు పండగలు ఆర్భాటంగా చేయాలన్న ఆసక్తి లేదు. స్తోమతు సంగతి సరేసరి. అందుచేత తన కూతురి పుట్టిన రోజు చాలా సింపుల్‌గా జరిపించే విషయంలో అతను వసంతను ఇదివరలోనే ఒప్పించి ఉన్నాడు. అయితే పంకజాక్షి జరిపిన ఒక్క పుట్టిన రోజుతో అవన్నీ ఎగిరిపోయాయి.

"మీకు ఒక్కొగానొక్క పిల్ల మీకే మన్నా లేదా, పోదా, ఎంతలేనివాళ్లు కూడా పుట్టిన రోజు పండగ అందులోనూ మొదటిది ఆర్భాటంగా చేసుకుంటున్నారు. కావాలంటే వచ్చే ఏడాది నుంచి మానెయ్యొచ్చుగానీ, ఈ ఏడాదిమాత్రం జరిపి తీరాల్సిందే, నేనూరుకోను" అందిట పంకజాక్షి.

"వాళ్లకు వెయ్యో, రెండు వేలో ఖర్చయియుంటుంది. అంత ఖర్చు మనం చేయలేం మనస్థాయి ఆర్భాటానికి ఎంత సింపుల్‌గా చెయ్యాలన్నా పదిమందిని పిలవాలంటే రెండొందలయినా అవుతుంది. ఆ డబ్బుతో దానికేదైనా వస్తువు చేయిస్తే నాలుగు కాలాలపాటుంటుంది. పార్టీదేముంది, ఒక్క రోజుతో డబ్బు సరి!" అని మూర్తి నెమ్మదిగా చెప్పి చూశాడు. ప్రయోజనం లేకపోయింది.

ఈ విషయంలో వసంతకు పంకజాక్షిది మాత్రమే కాదు, చుట్టుపక్కల ఆడవాళ్ళందరి సపోర్టూ ఉంది. పుట్టిన రోజు పార్టీ చేయకపోతే వాళ్ళ మధ్య తను తల ఎత్తుకోలేనంది వసంత. ఆమె తలెత్తుకు తిరగడం కోసం మూర్తి పుట్టినరోజు ఆర్భాటంగా చేసి బ్యాంక్ బాలన్స్ చూసుకుని కలవరపడిపోయాడు. ఈ సమస్య ఇప్పటితో ఆగేలా లేదు. వెంటనే దీనికి పరిష్కారం చూడకపోతే చేతికి చిప్ప రావడం తథ్యం.

అతనింకా ఆలోచనల్లో ఉండగానే మరో సమస్య వచ్చిపడింది. మూర్తిని స్కూటర్ కొనుక్కోమని కాల్చేయసాగింది వసంత. అదీ పంకజాక్షి ప్రోద్బలం మీదనే. మీ హోదాకు ఒక స్కూటరైనా లేకపోతే బాగుండదందిట ఆవిడ. స్కూటరుంటే బోలెడు షికార్లు చెయ్యచ్చునీ.... బస్సులమీదా, రిక్షాల మీదా అధారపడనక్కరలేదనీ ఆవిడ వివరించిందట. స్కూటర్ కావాలంటే రెండేళ్ళపాటు ఎదురుచూడాలి, వెంటనే దొరకదని మూర్తి అంటే – "అటువంటి ఇబ్బంది లేదు. మీరు ఊ అంటే వారం రోజుల్లో మీకు దొరికే ఏర్పాటు భర్త ద్వారా చేయిస్తానని పంకజాక్షి చెప్పింది" అంది వసంత.

మూర్తికి గుండె ఆగిపోయింది. తన ప్రతి మాటనూ ఎంతగానో అర్థం చేసుకునేందుకు ప్రయత్నించే వసంత ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. తన ఆర్థిక పరిస్థితి గురించి పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. ఆమెకిప్పుడు పంకజాక్షి మాట వేదవాక్కు. ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించడానికి కూడా వ్యవధి లేదు. వెంటనే ఏదో చెయ్యాలి. ఏం చెయ్యాలో అతనికి తోచలేదు. అందుకే అతని ఆప్తమిత్రుడు శర్మను సలహా అడిగాడు.

శర్మ చిర్నవ్వు నవ్వి "ఒక్కటే ఉపాయం. ఇల్లు మార్చేసేయ్" అన్నాడు.

నిజమే! దీనితో సమస్యచాలా సులువుగా పరిష్కారమైపోతుంది. ఇన్నాళ్ళూ తనకీ అయిడియా తట్టనే లేదు. మూర్తి శర్మను మెచ్చుకుని "నువ్వే చూసి పెడుదూ ఓ యిల్లు. ఈ ఊళ్ళో నీకు తెలియని వివరాలుండవు" అన్నాడు.

శర్మ ఒక్క నిముషమాలోచించి "మా వీధిలోనే నాకు తెలిసినాయనకు ట్రాన్సుఫరయింది. ఓ వారం రోజుల్లో ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోతాడు. అదేమైనా దొరుకుతుందేమో ప్రయత్నిస్తానులే" అన్నాడు.

"ప్రయత్నించడం కాదు. వెంటనే తెలుసుకుందాం అన్నాడు మూర్తి"

ఇద్దరూ కలిసి ఆ సాయంత్రమే ఆ ఇంటికి వెళ్ళారు. బయలుదేరిన ముహూర్తం మంచిదో ఏమో గానీ వెంటనే ఆ ఇల్లు మూర్తికి దొరికేసింది. మునుపటి ఇంటి కంటె ఈ ఇంటి అద్దె పదిహేను రూపాయలు తక్కువ. అనగా ఆరవై రూపాయలు మాత్రమే.

ఇంట్లో హంగులు కూడా బాగున్నాయి. పొరుగు కూడా ఖరీదైనది కాదు. నెలకు రెండు మూడొందలు సంపాదించే గుమాస్తా గారొకాయన పక్క వాటాలో ఉంటున్నాడు. వాళ్ళు చాలా స్నేహపాత్రులని శర్మద్వారానూ, కాళీ చేస్తున్నాయన ద్వారానూ కూడా విన్నాడు మూర్తి. అన్నిటికీ మించిన సుగుణం - ఇల్లు ఆఫీసుకు దగ్గర్లో ఉంది. బస్సు ఖర్చు ఆదా చేయవచ్చును. ఇలా అన్నీ సంతృప్తికరంగా కనిపించేసరికి మూర్తి ఆ ఇంటికి అడ్వాన్స్ కూడా ఇచ్చేశాడు. ఇంటికి వెళ్ళేక భార్యతో "మనకింక స్కూటర్ అవసరం లేదు వసూ! ఆఫీసుకు దగ్గర్లో ఇల్లు చూశాను" అన్నాడు.

ముందు వసంత ఆశ్చర్యపోయింది. వివరాలన్నీ విని ఆమె కూడా ఆ ఇంటినొకసారి చూసేక సంతృప్తి పడింది. పది రోజుల్లో వాళ్ళ మకాం మారిపోయింది.

చక్కని పొరుగు పోతోందని పంకజాక్షిగారు చాలా బాధ పడింది. బాద అనంతరం "మళ్ళీ మీలాంటి పొరుగు దొరుకుతుందో దొరకదో, ఎలాంటి వాళ్లు వస్తారో అటువంటి బాధలు లేకుండా ఇల్లంతా మేమే తీసుకుంటాం ఎలాగూ మా సామాను కిప్పుడున్న ఇల్లు చాలడం లేదు" అంది. ఇల్లు మారడానికి పంకజాక్షి కారు నుపయోగించుకుంది వసంత. సామాను మాత్రం ఓ పెద్ద బండిలో వేశారు. మనుషులూ, కొద్దిపాటి సామానూ కారులో బయలుదేరారు "అద్దె తక్కువైనా ఇల్లు బాగుంది" అంటూ మెచ్చుకుంది పంకజాక్షి అద్దె తక్కువైనా అనేపదాన్ని ఒత్తిపలుకుతూ. "మమ్మల్ని మర్చిపోకండేం" అని "పోనీ కారుందిగదా, మీరే రాకూడదా అంటారేమో - అదీ నిజమే! నేనెలాగూ వస్తుంటాను, మీరు కూడా వస్తుండాలి మరి" అని వెళ్ళిపోయింది పంకజాక్షి.

కొత్త ఇంట్లో అడుగు పెట్టిన కొన్నాళ్ళపాటు పంకజాక్షిని మరచిపోలేకపోయింది వసంత. కానీ పక్కింటి శ్రీదేవి గారి పరిచయంలో క్రమంగా ఆమెను మరచిపోగలిగింది.

శ్రీదేవి నెమ్మదస్తురాలు. చక్కగా మాట్లాడే నేర్పు ఉంది. అదీకాక అంతస్తులో వసంత కంటే ఎక్కువది కాదు. ఈ మూడింటివల్లా వసంతకు శ్రీదేవి బాగా నచ్చింది.

శ్రీదేవి ఇంట్లో అన్ని రకాల సదుపాయాలూలేవు. బొగ్గుల మీద వంట. ఇంట్లో చెప్పుకోదగ్గ ఫర్నిచర్ లేదు. అయినా వాళ్ళ ఇల్లు మాత్రం చాలా నీట్‌గా ఉంటుంది. ఇవన్నీ చూసేక - తన స్థితి గొప్పదేనని గ్రహించిన వసంతకు కొంత సంతృప్తి మిగిలింది. అదే సంతృప్తిని ఆమె భర్త దగ్గర కూడా వెలిబుచ్చింది. మూర్తి అపరిమితానంద భరితుడై శర్మకు మనస్సులోనే ధన్యవాదాలర్పించుకున్నాడు.

ఆరు నెల్ల సావాసంలో వారు వీరవుతారన్న సామెత వసంతకు వర్తించింది. ఆమెకు పంకజాక్షి లక్షణాలు చాలా అంటుకున్నాయి. ఆమె శ్రీదేవి ఇంటి శుభ్రతను గురించి మెచ్చుకుంటూ ఆమెను తనతో సమానం చేస్తూనే తన దర్పాన్ని ప్రకటించ సాగింది. అంతటితో ఆగిపోతే సరిపోయేది - సలహాలివ్వడం కూడా ప్రారంబించేది.

"చూడండి, పొద్దునే లేచి కుంపటితో ఏమవస్థపడతారు? గ్యాస్టవ్వుంటే ప్రాణం హాయిగా ఉంటుంది. ఒక్కసారే డబ్బు పోయక్కరే లేదు. నెలకో పాతిక రూపాయల చొప్పున ఏడాదో, పది నెల్లో వాయిదాలు కడితే సరిపోతుంది. ఆ మాత్రం ఖర్చు చేయలేరా

మీ ఆయన. మనకా మాత్రం తాహతులేదంటారా?" అనేది. గ్యాస్‌స్టవ్ సుఖాన్ని కళ్లారా చూసిన శ్రీదేవి మంత్ర ముగ్ధురాలిలా ఈ మాటలు వినేది. ఫలితంగా ఆమె భర్త ఆనందరావుకు సమస్యలు ఏర్పడసాగాయి.

"చూడు దేవీ - వాళ్ళ ఆదాయం వేరు. స్నేహం స్నేహంగానే ఉండాలి గానీ అనుకరణకు దిగితే భరించడం కష్టం" అని అతను భార్యకు నచ్చచెప్పడానికి విఫల యత్నాలు చేశాడు. ప్రస్తుతం గ్యాస్‌స్టవ్ కొనడానికి సరిపడ్డ డబ్బు తనవద్ద లేకపోలేదు. కానీ అనుకోని ఖర్చులు తగిలితే తట్టుకోడానికి కొంత నిలవ అవసరం. అయితే శ్రీదేవి అవసరాన్ని గుర్తించలేదు. మొత్తంమీద ఆమె భర్త చేత గ్యాస్‌స్టవ్ కొనిపించింది.

"గ్యాస్ ఆదా కావాలంటే ప్రెషర్ కుక్కరుండాలండీ - ఓ నూట పాతిక రూపాయలీవేళ ఖర్చు చేసినా ఓ ఏడాదిలో ఆ సొమ్ము మనకు గ్యాస్‌లో ఆదా అవుతుంది. మగవాళ్ళు మనకు తెలీకుండా డబ్బు నిలవేస్తూనే ఉంటారు. డబ్బు లేదన్న మీ ఆయన అడగ్గానే గ్యాస్ స్టవ్ కొన్నారా లేదా? మనం పట్టు పట్టడంలో ఉంటుందంతే" అంటూ మరో సలహా పారేసింది వసంత. అమలు జరిపేసింది శ్రీదేవి.

అప్పుడే గుర్తించేశాడు - ఆనందరావు ఇది ఇక్కడితో ఆగేది కాదని. ఒక భయంకర ప్రమాదం తన్నావరించుకోబోతోంది అని గ్రహించిన అతను ఆ రాత్రి భార్యకు పెద్ద హితోపదేశం చేశాడు. "లోకంలో రకరకాల వర్గాల వ్యక్తులుంటారు. వారి వారి హోదాను బట్టి వారు ప్రవర్తిస్తుంటారు. మనకు ఒకరి ప్రసక్తి ఉండకూడదు. తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్టా, ఉండడానికి ఇల్లూ ఈ మూడూ ఉన్న ప్రతి ఒక్కరూ అదృష్టవంతులే. ఆ అదృష్టానికి సంతృప్తి చెందడమే మన కర్తవ్యం. అంతేకానీ మనకంటే ఎక్కువ అదృష్టవంతుల్ని చూసి అంతటి అదృష్టం మనకు లేదే అని బాధపడకూడదు. అవసరమనేదాన్ని నిర్వచించడం కష్టం. సాగితే కారు నుంచి విమానం దాకా అన్నీ అవసరమే. కానీ ప్రతీ మనిషికీ ముఖ్యంగా అవసరమైనవి తిండి, బట్టా, ఇల్లు, మిగతావి తాహతునిబట్టి అవసరమవుతాయి. ముఖ్యావసరాలు మనకు తీరుతూనే ఉన్నాయి కదా. మిగతావి మన ఆర్థిక పరిస్థితిని బట్టి చూసుకుందాం. అన్నీ ఒక్కసారి కొనలేం గదా నా దగ్గరున్న డబ్బు సంగతి నీకు పూర్తిగా తెలుసు. నేనేం వృధా చెయ్యడం లేదు. కాస్త డబ్బున్నప్పుడల్లా ఒక్కటొక్కటిగా నీ కోరికలు తీర్చడానికి ప్రయత్నిస్తాను, ఏమంటావ్?"

శ్రీదేవి మౌనంగా ఈ ఉపన్యాసాన్ని వింది. అప్పటికెమీ మాట్లాడలేదు. అమ్మయ్య అనుకున్నాడు ఆనందరావు. మర్నాటినుంచి మళ్ళీ మామూలే! అది శ్రీదేవి తప్పు కాదనీ వసంత మహాత్యమనీ అతను గుర్తించేడు. ఆ గుర్తింపు అతను దృఢపరచుకోవడానికి మరోనెల పట్టింది. దృఢపరచుకున్నాక అతనిలో భయం జాస్తిగా పెరిగిపోసాగింది. ఏం చేయాలో తోచలేదు.

ఓ రోజు సాయంత్రం ఇంట్లో ఆడవాళ్ళు మాట్లాడుకుంటున్న సమయంలో వీథరుగుమీద మూర్తిని పలకరించాడు ఆనందరావు "మిమ్మల్ని చాలాకాలంగా

అడుగుదామనుకుంటున్నాను. మీ రిదివరకుండే ఇల్లు బాగానే ఉండేది కదా. ఇరుగూ పొరుగూ మంచివారుటగదా. నాలుగేళ్ళ నించి ఆ ఇంట్లోనే ఉంటున్నారుట గదా మరి ఎందుకు మార్చేశారండీ!" ఆనందరావు ఇలా అడగడంలో బాధ ఉంది. ఉన్న వాడివి అక్కడ ఉండక నామీదకెందుకొచ్చి పడ్డావురాబాబూ అన్న బాధ అది.

ఆనందరావు నవ్వి "ఆఫీసుకు దగ్గర్లో ఉంది కదండీ"అని స్వరం కొంచెం తగ్గించి "అసలు కారణం వేరే లేకపోలేదులెండి. మా పక్క వాటాలోకి లక్షాధికారి కాపురానికి కొచ్చాడు. వాళ్ళ ఖర్చులూ అవీ చూసి మా ఆవిడ కూడా అలాగే చేయమనేది. మనబోటి ఉద్యోగస్తులకు అలా ఎలా సాగుతుంది చెప్పండి? చెబితే మా ఆవిడ వినేది కాదు. అయిదారు నెలల్లోనే నా ఖర్చు తడిపి మోపెడయ్యింది. ఆఖరికి ఓ స్నేహితుడి సలహా తీసుకుని ఇలా కాస్త రక్షణ ఉన్నచోట యిల్లు మార్చేశాను" అన్నాడు.

ఆనందరావు మూర్తి చెప్పేదంతా ఆశ్చర్యంగా విన్నాడు. అంతా విని చటుక్కున "థాంక్యూ వెరీమచ్" అని లేచి వెళ్ళిపోయాడు. అతనలా థాంక్స్ చెప్పి మధ్యంతరంగా వెళ్ళిపోడానిక్కారణం నాల్రోజులవరకూ తెలియలేదు మూర్తికి.

నాల్రోజుల అనంతరం ఆనందరావు ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయాడు. శ్రీదేవిని వదలడానికి వసంత చాల బాధపడింది. బాధపడుతూనే సామాను సర్దడంలో ఆమెకు సాయం చేసింది. వెళ్ళేముందు "మమ్మల్ని మరచిపోకండేం" అంది శ్రీదేవితో.

"మిమ్మల్ని మరచిపోవడమా - ఎంతమాట" అంది శ్రీదేవి.

వారిదీ ఆర్నెల్ల సావాసమే మరి.

✦ ✦ ✦